ప్రజల అండదండలతో అభివృద్ధి

■ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

కాచిగూడ, జనవరి 21 : ప్రజల అండదండలతో అంబర్‌పేట నియెజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బీజేపీ హయంలో డ్రైనేజీ పైపులైన్ల సమస్యలను పట్టించుకోలేక పోవడంతో ప్రస్తుతం సమస్యలు పుట్టుకొస్తున్నాయని అన్నారు. గోల్నాక డివిజన్‌లోని ఎస్సీ హాస్టల్, సమీపంలో రూ. 9.5 లక్షలతో నూతన పైపులైన్ పనులను ఆదివారం గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం నింబోలిఅడ్డాలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్, రోడ్ల సమస్యలు పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. నీటి కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారంతో పాటు బస్తీ, కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జలమండలి మేనేజర్ షాకీర్, రెడపాక రాము, పల్లవి, గండికోట జనార్దన్, అంజయ్యచారి, భరత్ ముదిరాజ్, కాలేరు రామకృష్ణ, కాలేరు రాజు, నర్సింగ్ ముదిరాజ్, పట్లూరి సతీశ్ పాల్గొన్నారు.

ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్, జనవరి 21: బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షునిగా సీనియర్ నాయకుడు కొండా శ్రీధర్‌రెడ్డిని యమి తులయ్యారు. డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్న శ్రీధర్‌రెడ్డిని డివిజన్ అధ్యక్షుడిగా నియమించినట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాయ కత్వంలో ప్రజా సమస్యల పరిష్కారాని కి కృషి చేస్తానని అన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అంబర్‌పేట, జనవరి 21 : ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో దత్తసాయి మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఎండీ డాక్టర్ ఎం.ఎస్. రంగారెడ్డి తెలిపారు. 924 6366944కు ఫోన్ చేసి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి, జనవరి 21: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నూతన ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ సూచించారు. ఆదివారం జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కార్పొరేటర్ సందర్శించారు. ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

'మన సంస్కృతిని భావితరాలకు తెలుపాలి'

ముత్యాల ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, జనవరి 21: మన సంస్కృతిని భావి తరాలకు తెలుపాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో నియోజకవర్గ పద్మశాలీ సంఘం, పద్మశాలీ రాజకీయ వేదిక ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు, ముఠా జైసింహ, కాంగ్రెస్ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్, పద్మశాలీ సంఘం గ్రేటర్ నాయకుడు కత్తుల సుదర్శన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్త రమేశ్‌తో కలిసి ఎమ్మెల్యే ముగ్గుల పోటీలు సందర్శించారు. ఈ పోటీల్లో 150 మంది పాల్గొనగా.. విజేతలకు 26న ఇందిరాపార్కులో సరిగే పద్మశాలీ మేళాలో బహుమతులు అందజేస్తామని సంఘం అధ్యక్షుడు అతినగరం సుదేశ్ నేత తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బైరి మనోహర్ రావు, కోశాధికారి సోమ సతీశ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు బోనం ఊర్మిల, కార్యదర్శి బోడ నిర్మల, యువజన అధ్యక్షుడు సిరిగాదె శ్రీధర్, కార్యదర్శి బోనం బన్నీ, ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ సమత, సంధ్యరాణి, అమరావతి, రేఖ, రూప, స్వప్న వ్యవహరించారు. సంఘం సలహాదారులు మంతెన దశరథం, అంకం చంద్రమౌళి, బీఆర్ఎస్ నాయకులు వంగల నర్సింగ్ రావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నాంపల్లి మెట్రో కోర్టు ఎంప్లాయీస్ అసోసియేషన్ క్రికెట్ మ్యాచ్ అంబర్‌పేట అలీ కేఫ్‌లోని వాటర్ వర్క్స్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, డివిజన్ కార్పొరేటర్ ఈ.విజయ్‌కుమార్‌గౌడ్ హాజరై టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు.

– అంబర్‌పేట, జనవరి 21

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో అయోధ్యలో సోమవారం శ్రీరాముల వారి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం తెలిపారు. ఆదివారం ఆలయంలో ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ చాలీసా పారాయణం, రామతారక హోమం, రామభజన, అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. – చిక్కడపల్లి, జనవరి 21

నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట / చార్మినార్, జనవరి 21: శివం రోడ్డులో ఉన్న అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆవరణలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. నాలుగు ఎకరాల్లో రూ.19.90కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్. గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, సైనా నెహ్వాల్, సునీతా కృష్ణన్ పాల్గొన్నారు.

మ్యూజియాలు విజ్ఞాన గనులు ..

మ్యూజియాలు విజ్ఞాన గనులని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన రెండు అధునాతన బ్లాక్‌లను కేంద్ర మంత్రి ప్రారంభించారు. సాలార్‌జంగ్ మ్యూజియం నిర్వహణకు ప్రభుత్వ నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యు,కె, యెఎస్ఏ వంటి దేశాల్లోని దౌత్య కార్యలయాల్లో టూరిజం అధికారులను నియమించి పర్యాటకాన్ని ప్రోత్సాహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం అధికారులు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యత సాధించాలి

సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్

చిక్కడపల్లి, జనవరి 21 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నూరు శాతం అక్షరాస్యత సాధించాలని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వీకే ఆధ్వర్యంలో విద్యారంగంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరై మహిళలు, బాలికలు అక్షరాస్యత తక్కువగా ఉందని వారి అక్షరాస్యత పెంచడానికి ప్రభు త్వం దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి మాడభూషి శ్రీధర్ , ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ కుమార్, టీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వరు, జి.బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వంశీరామరాజు సేవలు అభినందనీయం

సాంస్కృతిక రంగంలో వంశీరామరాజు సేవలు అభినందనీయమని జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో శ్రీదత్త సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కామరాజుగడ్డ బాబురావు, సీతారావమ్మ గిరిజ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. వంశీరామరాజుకు బాబురావు పురస్కారం, డా. తెన్నేటి సుధా దేవికి గిరిజ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రచయిత్రి కామరాజుగడ్డ వాసవదత్త రమణ రచించిన పాశం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కొలకలూరి ఇనాక్, మంజులత, గడ్డూరి అశోక్‌బాబు, సత్యవోలు సుందరసాయి, ఎస్వీరామారావు పాల్గొన్నారు. పాశం రచయిత్రి వాసవదత్త రమణను సన్మానించారు. – రవీంద్రభారతి, జనవరి 21

నేడు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

సుల్తాన్‌బజార్,జనవరి 21 : పవిత్రమైన అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమిలో సోమవారం శ్రీ బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వ హిస్తున్నట్లు వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోఠిలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి శ్రీ రాముల వారికి ప్రత్యేక పూజలు, అయోధ్యలో జరుగుతున్న బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ ఇక్కడి ప్రజలకు చూపించేందుకు ఎల్ఈడీ ప్రదర్శన, అన్న ప్రసాద పంపిణీ, సాయంత్రం దీపోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలకు హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, వీహెచ్‌పీ నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

■ యువత ఆదర్శ వివాహాలు చేసుకోవాలి

మాట్లాడుతున్న వి.హనుమంతరావు,పాల్గొన్న మహాసభ ప్రతినిధులు

కాచిగూడ, జనవరి 21 : యువత ఆదర్శ వివాహాలు చేసుకోవాలని, పేదల పిల్లలను వివాహం చేసుకున్నప్పుడే సమాజం బాగుపడుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్లో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా 300 పైగా జంటలు పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీహెచ్ హాజరై మాట్లాడుతూ..మున్నూరుకాపుల్లో ఐక్యతను పెంపొందించాలని, విదేశాల్లో కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మంగళరపు లక్ష్మణ్, పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్, కొంతం సురేశ్, లింగిశెట్టి హన్మంత్‌రావు, కొండూరు వినోద్‌కుమార్, శంకర్, మందా సూర్యప్రకాశ్, రాఘవేందర్, దామేర జ్ఞానేశ్వర్, జితేందర్, మణికొండ రమేశ్‌కుమార్, జ్ఞానేశ్వర్ రావు, ఐలి శ్రీనివాస్, కె. సునీల్, కె. ప్రకాశ్, ఎనుగుల మాణిక్‌ప్రభు, ఆకుల రామారావు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

హిందుత్వ భావాలు పెరుగుతున్నాయి

చిక్కడపల్లి, జనవరి 21 : దేశంలో హిందుత్వ భావాలు పెరుగుతున్నాయని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స భ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కా మ్రెడ్ లెనిన్ శత జయంతి సభ నిర్వహించారు. పార్టీ కార్యవర్గ సభ్యులు జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగ య్య, సీతారాములు పాల్గొన్నారు.

సన్మానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా సంబంధాలు, ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన వేణును సెట్విన్ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్ కుమార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా ఆయనకు బొకే అందించి, శా లువాతో సన్మానించారు.

– చాంద్రాయణగుట్ట, జనవరి 21

సీతారాముల కల్యాణం

అయోధ్యలోని రామ మందిరంలో సోమవారం జరగనున్న స్వామి వారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోషామహల్ నియోజకవర్గం సీతా రాం బాగ్‌లోని జగన్నాథ మఠంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకురాలు లతామా ఫౌండేషన్ చైర్‌పర్సన్ కొంపెల్ల మాధవీలత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో త్రిదండి రామానుజ వ్రతధర్ జీయర్ స్వామి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. – అబిడ్స్, జనవరి 21

వ్యక్తి అదృశ్యం

లింగయ్య

కాచిగూడ, జనవరి 21 : వ్యక్తి అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌కు చెందిన ఎడ్గి లింగయ్య (59) సెక్యూరిటీ గార్డు. కొంత కాలంగా లింగయ్యకు మతిస్థిమితం లేదు. ఈ నెల 19న ఇంట్లోంచి బయటకు వెళ్లి రాకపోవడంతో భార్య ఆదివా రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆకుపచ్చ రంగు చొక్క, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎ త్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీరామ దివ్య వైభవం సంపుటి ఆవిష్కరణ

ముషీరాబాద్, జనవరి 21: శ్రీగీతా ఫౌండేషన్, లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో శ్రీరామ దివ్య వైభవం కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. డాక్టర్ జయరాములు ముఖ్య అతిథిగా విచ్చేసి కవితా సంపుటిని ఆవిష్కరించారు. గంటా మనోహర్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, బడేసాబ్, యోగేష్‌ప్రభు, బద్రీనాథ్, అంజనీకుమారి, జేవి కుమార్, ప్రవీణ్, రాధా కుసుమ, సోమయాజుల ప్రసాద్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

యాదవులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి..

లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎన్ఆర్ఐ యాదవ సంఘం ప్రతినిధి ఆబోతు మధు యాదవ్, ఎం.బి. బాలసుబ్రహ్మణ్య తేజ యాదవ్, వరుణ్ యాదవ్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు యాదవులకు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇవ్వాలని కోరారు. వినతి పత్రం సమర్పించారు. – అబిడ్స్, జనవరి 21

బీసీలను కాంగ్రెస్ మోసం చేసింది

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సేనా అధ్యక్షుడు బర్క కృష్ణ

ముషీరాబాద్, జనవరి 21: అసెంబ్లీ ఎన్నికల్లో అధిక సీట్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ 22 స్థానాలు ఇచ్చి బీసీలను మోసం చేసిందని బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 8 స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్, శ్రీశైలం యాదవ్, చెన్నయ్య, వెంకటేశ్ యాదవ్, బాలస్వామి, నర్సింహులు, రమే శ్, చందు, సందీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూస్తా..

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్ల మహిళలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ప్రభుత్వ పథకాలను అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అధికారులతో చర్చించి పథకాలు అందిస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 21

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, దానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కే.హరీష్ రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ చౌరస్తాలో పూల్‌బాగ్ బస్తీ కమ్యూనిటీ హాల్లో మూడు నెలలుగా కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లు, సబ్సిడీ ధరలకు కుట్టుమిన్లు పంపిణీ చేశారు.

– కవాడిగూడ, జనవరి 21

శ్రీరాముడి పునః ప్రతిష్ఠ

సుల్తాన్‌బజార్, జనవరి 21 : అయోధ్యలోని రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ పునః ప్రతిష్ఠ సందర్భంగా రాంకోఠిలోని శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిరహిస్తున్న పూజలు నేటి వరకు కొనసాగుతాయని ఆలయ ట్రస్టీలు మఠం సత్యనారాయణయాదవ్, కావేరి సత్యనారాయణయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం రాంకోఠిలోని ఆలయంలో అలంకరణల నడుమ శ్రీరాముడుకి పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న హనుమాన్ వ్యాయామ శాల కార్యదర్శి మైథిలి శరణ్ సన్మానించారు. ఆలయ ట్రస్టీలు అశోక్ పవార్, రత్నేశ్, జైరాజ్, ప్రదీప్, రమేశ్ ముదిరాజ్, కమలాకర శాస్త్రి,నిలేశ్ మహారాజ్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీసీ మారుతీదివాకర్

అంబర్‌పేట, జనవరి 21 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరణలో భాగంగా ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను బూత్ లెవెల్ పోలింగ్ అధికారులు స్వీకరించారు. ఈ ప్రక్రియను అంబర్‌పేట డీసీ మారుతీ దివాకర్ పరిశీలించారు. గోల్నాకలోని సెయింట్ పాల్స్ స్కూల్, నెహ్రూనగర్ వార్డు కార్యాలయం, పోలింగ్ బూత్ నంబర్లు, 180 నుంచి 185 వరకు కేంద్రాలను సందర్శించారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి ..

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మెహిదీపట్నంలోని విజయ్‌నగర్ కాలనీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చే న ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, పోటీతత్వం పెరుగుతుందని అన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 21

క్రీడలతో మానసిక ఉల్లాసం

చార్మినార్, జనవరి 21 : క్రీడలు శారీరక, మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తాయని చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్ అన్నారు. ఆదివారం సిటీ కాలేజీ విద్యార్థులు నిర్వహించిన కబడ్డీ పోటీలను ఏసీపీ ప్రారంభించి మాట్లాడుతూ.. క్రీడలు నూతన ఉత్తేజం, పోటీతత్వం, సమస్యలను పరిష్కరించే శక్తి ఇస్తాయన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను వ్యక్తిగతంగా పరిచయం చేసుకున్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

అబిడ్స్, జనవరి 21 : మంగళ్‌హాట్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల, గోషామహల్ బాలికలు-1 పాఠశాలలో 2024-25సంవత్సరానికి 5 తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సం వత్సరానికి మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 6,7,8 తరగతులకు దరఖాస్తులు స్వీకరిస్తామని యాజమాన్యం తెలిపింది. ఇంటర్ మొదటి ఏడాది కోసం మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇస్తామని 5వ తరగతిలో మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులను లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ ప్రీతిఠాకూర్ తెలిపారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 6వ వరకు ఆన్‌లైన్ ద్వారా (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఉఎస్. తెలంగాణ.గవ్.ఇన్) ద్వారా , పాఠశాల కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఇతర వివరాలకు 7995 057897 / 7893771048లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.